# ఎన్నెన్ని కసుగాయల్ రాలె.....

'పెద్దాసి'



**వేసవికాలపు ఎండ తీవ్రతమూ, ఉక్కపోతమూ భరించలేక గది కిటికీలన్నీ మూసివేసి ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌కి పెంచి బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' పుస్తకం చేతుల్లోకి తీసుకొని మంచంమీద మేను వాల్చాను.**

పుస్తకం చదువుతుంటే ఇంత చక్కని పుస్తకం యింతకాలం చదవలేకపోయినందుకు నన్ను నేనే తిట్టుకుంటూ పూర్తిగా కథలో లీనం అయిపోయాను. ఇంతలో కాలింగ్ బెల్ శబ్దంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి, మంచం దిగి తలుపు తీయటానికి హాల్లోకి నడిచాను.

బహుశా శ్రీవారే అయ్యుంటారన్న నా ఊహ తలుపు తీయగానే ఎదురుగా నవ్వుతూ నిలబడివున్న రాములమ్మను చూడగానే తప్పని తేలిపోయింది. నల్లగా నిగనిగ లాడుతున్న శరీరానికి ఆకుపచ్చని చీరె వింత అందాన్నిస్తుంటే, తలలో మల్లె మొగ్గలతో, నుదుట ఎర్రని కుంకుమతో, పెదవులపై చిరునవ్వుతో, అమాయకత్వాన్ని మొహం అంతా పులుముకొని నండూరివారి 'ఎంకి'లా రాములమ్మ నా ఎదుట నిలుచొని –

"మాటనీ సినిమాకెళ్తుండానమ్మగోరూ. పెందరాడే పనిచేసి పోదామని వచ్చినా" అంది.

ప్రక్కగా రాములమ్మ కొడుకు వెంకటేశ్వర్లు నన్ను చూసి సిగ్గుపడుతూ నిలబడ్డాడు. నేను ప్రక్కకు తప్పుకొని వాళ్ళిద్దరూ యింట్లోకి వెళ్ళటానికి మార్గం వదలి, వాళ్ళు లోపలికి రాగానే తలుపు గడియ వేశాను.

"ఒరేయ్ వెంకటేశ్వర్లూ ... నువ్వాడ కూచో. నేను పని చేసుకొని ఎంటనే వచ్చేస్తాను" అని కొడుకుని హాల్లో ఒక ప్రక్కగా కూర్చోబెట్టి పనిలోకి దిగింది రాములమ్మ.

వెంకటేశ్వర్లు బుద్ధిమంతుడిలా కూర్చొని హాల్లోని వస్తువులను పరీక్షచేయసాగాడు. వాడిని చూస్తున్న నాకు వాడితో మాట్లాడా లనిపించి ఈజీ చైర్లో కూర్చుంటూ "ఏరా, బాగా చదువుతున్నావా ?" అని అడిగాను. దానికి వినయంగా తలూపి సమాధానం